క్లుప్తంగా

పేరుకే క్రీడా ప్రాంగణం!



బోర్డుకే పరిమితమైన క్రీడా ప్రాంగణం ఇదే..

అశ్వారావుపేటరూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణం కేవలం బోర్డుకే పరిమితమైంది. అశ్వారావుపేట మండలం వినాయకపురం గ్రామ పంచాయతీ పరిధిలో ప్రధాన రహదారి పక్కనే స్థలాన్ని కేటాయించారు. ఈ స్థలంలో పంచాయతీ ద్వారా క్రీడా ప్రాంగణం బోర్డును ఏర్పాటు చేసి వదిలేశారు. ఈ మైదానంలో నిబంధనల ప్రకారం వాలీబాల్ నెట్‌తోపాటు, పలు రకాల క్రీడా సామగ్రిను ఉంచాల్సి ఉంది. కానీ నేటికి వాటి ఊసే లేకపోవడంతో ఈ ప్రాంగణం అంతా వృథాగా మారింది. అంతేకాదు మైదానంలో పిచ్చి మొక్కలు పెరిగిపోగా, ఆటలు ఆడేందుకు వీలు లేకుండా పోయిందని గ్రామీణ క్రీడాకారులు వాపోతున్నారు.

క్రికెట్ విజేత చిన్నబండిరేవు జట్టు

దుమ్ముగూడెం: మండలంలోని లచ్చిగూడెం గ్రామంలో ఉద్యోగుల సంఘం-ఫ్రెండ్స్ యూత్ అద్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో చిన్నబండిరేవు జట్టు విజేతగా నిలిచింది. గత 26 రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా ఆదివారం కొత్తపల్లి,చిన్నబండిరేవు జట్ల మధ్య ఫైనల్ పోరు జరిగింది. ఈ ఫైనల్ పోరులో చిన్నబండిరేవు జట్టు విజేతగా నిలువగా టోర్నమెంట్ మొదటి బహుమతి రూ.25000, ట్రోఫీ (చిన్న బండిరేవు), రెండో బహుమతిగా రూ.15000, ట్రోఫీ (కొత్తపల్లి) జట్లకి నిర్వహకులు అందజేశారు. ఈ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌కి ముఖ్య అతిథులుగా లచ్చిగూడెం ఉద్యోగులు సంఘం నుంచి చెంచయ్య, వీరాస్వామి, బాబూరావు, వీరమ్మ, రోశమ్మ, రంజిత్, సుభద్ర, రవి, శ్రీను పాల్గొని బహుమతులు అందజేశారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీగా లచ్చిగూడెం ఫ్రెండ్స్ యూత్ వ్యవహరించారు.

కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలి

అశ్వాపురం: మండలంలో పట్టభద్రులు అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఉద్యోగ ఖాళీలు భర్తీ చేస్తూ నిరుద్యోగ యువతకు ధైర్యం కల్పిస్తూ అర్హులకు ఉద్యోగాలు ఇచ్చేందుకు ముందుకు సాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టభద్రులు మద్దతు తెలిపాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన మిత్ర పక్ష పార్టీల ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఉన్న పట్టభద్రులు అందరూ ఓటు వేసేలా పోలింగ్ బూత్‌లకు తరలేలా ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, సీపీఐ పార్టీ మండల కార్యదర్శి అనంతనేని సురేష్, రాయపూడి రాజేష్, సురేందర్‌రెడ్డి, టీడీపీ నాయకుడు వాసు, కాంగ్రెస్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్‌బాబు, వీరభద్రారెడ్డి, సదర్‌లాల్, తూము వీరరాఘవులు, చెంచల రాము, సంపత్, గొల్లపల్లి నరేష్, హర్ష, మోసిన్, నాయకులు పాల్గొన్నారు.

మల్లన్నను గెలిపించండి

మణుగూరురూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీపీఐ, సీపీఎం, టీడీపీ, టీజేఎస్ బలపర్చిన తీన్మార్ మల్లన్న గెలుపును కాంక్షిస్తూ సీపీఐ నాయకులు ఆదివారం ప్రచారం నిర్వహించారు. మణుగూరు పట్టణంలో పలువురు పట్టభద్రులను కలుసుకుని కరపత్రాలను పంపిణీ చేస్తూ ఓట్లు అభ్యర్థించారు. ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఎమ్మెల్సీగా గెలిపించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ పినపాక నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, మండల,పట్టణ కార్యదర్శులు జంగం మోహన్ రావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుడికి ఆర్థిక సాయం

అశ్వాపురం: మండల పరిధిలోని వెంకటాపురం గ్రామానికి చెందిన రేషన్ డీలరు కోండ్రు శ్రీనివాస్ అనారోగ్యంతో బాధపడుతుండటంతో వైద్య ఖర్చుల నిమిత్తం గ్రామస్తులు తమ వంతుగా ఆదివారం రూ.13 వేలు ఆర్థిక సహాయం అందజేసి చేయూత అందించారు.

న్యాయ విచారణ చేపట్టాలి

బూర్గంపాడు: భద్రాచలంలో నర్సింగ్ విద్యార్థిని కారుణ్య మృతిపై న్యాయ విచారణ చేపట్టాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకుడు ధన్సీరాం పున్నంచంద్ డిమాండ్ చేశారు. ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో కారుణ్య మృతిపై ఉన్న అనుమానాలను నివృత్తి చేసి మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కారుణ్య మృతిపై న్యాయ విచారణకు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓలు తక్షణమే ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

పారదర్శకతకు పెద్దపీట

- అంగన్‌వాడీ సేవలపై కుటుంబ సర్వే
- పలు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు
- అవకతవకలకు చెక్ పడినట్టే..



సర్వేలో భాగంగా భద్రాచలంలో వివరాలు నమోదు చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

భద్రాచలంఅర్బన్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా ఉండేందుకు ప్రభుత్వం కుటుంబ సర్వే చేపడుతుంది. కేంద్రాల ద్వారా అందించే పాలు, గుడ్లు, బాలామృతం వంటివి లబ్ధిదారుల వరకు చేరకుండానే అందించినట్లు రికార్డుల్లో రాసే విధానానికి చెక్ పెట్టనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం 'న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం'పేరిట సర్వే చేపడుతోంది. మార్చి నెల నుంచి ప్రక్రియ ప్రారంభం కాగా.. ఎన్నికల నేపథ్యంలో కొంత జాప్యం జరిగింది. ప్రస్తుతం సర్వే పనుల్లో వేగం పెంచారు.

పెద్ద స్థాయిలో లబ్ధిదారులు..

దుమ్ముగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 173 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 7 నెలల లోపు చిన్నారులు 562 మంది, 7 నెలల నుంచి ఏడాది చిన్నారులు 723 మంది, 1 నుంచి 3 ఏళ్ల వరకు చిన్నారులు 2,197 మంది, 3 ఏళ్ల నుంచి 6 ఏళ్ల వరకు 2,401 మంది కలిపి మొత్తంగా 5883 మంది చిన్నారులు ఉన్నారు. గర్భిణులు 675, బాలింతలు 558 మంది ఉన్నారు. వీరందరికీ అంగన్‌వాడీ సేవలు పారదర్శకంగా సమకూరేందుకు మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎన్‌హెచ్‌టీఎస్ సర్వే చేపట్టారు.

సర్వే తీరు ఇది..

సర్వేలో భాగంగా ప్రతి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని ఇంటింటికీ సిబ్బంది వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. మొదట కుటుంబ యజమాని పేరుతో నమోదు ప్రారంభించి తర్వాత సభ్యుల వివరాలు నమోదు చేస్తున్నారు. వయస్సు, ఫోన్ నంబర్, కులం, ఉపకులం, పుట్టిన తేదీ, ఆధార్ కార్డ్ నంబర్ ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. అలాగే గర్భిణులు, బాలింతలు, 6 ఏళ్లలోపు చిన్నారులు, అంగవైకల్యంతో బాధపడుతున్న వారి వివరాలు సైతం నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియ చేపట్టడానికి అంగన్‌వాడీ టీచర్లకు సెల్‌ఫోన్‌లు అందించి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు.

సర్వే లక్ష్యం ఇది..

అంగన్‌వాడీలకు వచ్చే వారికి ఒక పూట సంపూర్ణ భోజనం అందిస్తున్నారు. ఇందులో బాలింతలు, గర్భిణులకు రోజుకు బియ్యం 150, కందిపప్పు 30, నూనె 16 గ్రాములు పాలు 200 మిల్లీ గ్రాములు, ఒక గుడ్డు ఇవ్వాలి. పిల్లలకు బియ్యం 75, కందిపప్పు 15, నూనె 5, మూడేళ్ల లోపు పిల్లలకు 16 గ్రాములు, ఆపై వయస్సు వారికి పని రోజులు పరిగణనలోకి తీసుకుని రోజుకు ఒక గుడ్డు అందిస్తారు. సర్వేలో భాగంగా కుటుంబాల సంఖ్య, జనాభా వివరాలు, చిన్నారులు ఎత్తుకు తగిన బరువు ఉన్నారా.. లేదా.. అనేది తేలనుంది. తద్వారా పోషక లోపంతో బాధపడుతున్న వారి వివరాలు అందుబాటులోకి రానున్నాయి. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం ఏ మేరకు అందుతుందో ఒక అంచనా ఏర్పాడుతుంది. గుడ్లు, పాలు కేంద్రాల నిర్వాహకులు పక్కదారి పట్టిస్తారనే ఆరోపణలున్నాయి. ఆయా చిన్నారులు, గర్భిణులు, బాలింతల పేరిట ప్రభుత్వం అందిస్తున్న వాటిని బహిరంగ మార్కెట్లో విక్రయించడం, ఇంటికి తీసుకెళ్లడం వంటివి చేస్తున్నారనే విమర్శలున్నాయి. మరో వైపు ప్రతినెలా చిన్నారుల ఎత్తు, బరువు వివరాలు నమోదు చేయాలి. ఇది నామమాత్రంగా చేపట్టడం వల్ల పోషకలోపంతో బాధపడుతున్న వారి వివరాలు పక్కాగా తెలియడం లేదు. దీంతో చిన్నారులకు అందాల్సిన పౌష్టికాహారం పంపిణీ కాక వారు బక్కచిక్కిపోతున్నారు. ఈ ఇబ్బందులను అధిగమించేందుకు సర్వే చేపడుతున్నారు.

ఇక పక్కదారికి అడ్డుకట్ట..

అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు అందించే వస్తువులు ఇకపై పక్కదారి పట్టకుండా ఉంటాయి. గతంలో కేంద్రానికి గర్భిణులు, బాలింతలు హాజరు కాకపోయినా వచ్చిన రాసేవారు. ఇకపై లబ్ధిదారులు ట్లుగా కేంద్రానికి వచ్చి భోజనం చేస్తేనే హాజరైనట్లు, కేంద్రానికి రాకుంటే చరవాణికి సంక్షిప్త సందేశం వెళ్తుంది. ఈ సర్వేతో తీవ్ర పోషకాహార సమస్యతో బాధపడే పిల్లల సంఖ్య జిల్లాస్థాయిలో తెలుస్తుంది.

పక్కాగా నిర్వహిస్తున్నాం..



దుమ్ముగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 170 అంగన్‌వాడీ కేంద్రాల్లో న్యూట్రీషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం సర్వే కొనసాగుతుంది. ఇప్పటికే ఆయా కేంద్రాలలో గల అంగన్‌వాడీ ఉపాధ్యాయులు 90 శాతం సర్వే చేశారు. వివరాలను పక్కాగా ఉండాలని సిబ్బందికి సూచించాం. చిన్నారులు, గర్భిణులు, బాలింతల వివరాలన్నింటినీ నమోదు చేస్తున్నాం. ఇకపై అవకతమకలకు అవకాశం ఉండదు.

– నవ్యశ్రీ, సీడీపీఓ, దుమ్ముగూడెం ప్రాజెక్టు

ప్రారంభోత్సవానికి సిద్ధం



మంగపేట పీహెచ్‌సీ అదనపు భవనం..

ములకలపల్లి: ములకలపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న మంగపేట పీహెచ్‌సీ అదనపు భవనం ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. మండలకేంద్రంలో సుమారు 35 ఏళ్ల క్రితం మంగపేట గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించారు. అప్పటి గవర్నర్ కుమెద్‌బెన్ జోషీ దీనిని ప్రారంభించారు. నాటి నుంచి ఏజెన్సీ వాసులకు ఇక్కడి నుండే వైద్య సేవలు అందుతున్నాయి. క్రమేపీ ఆస్పత్రి వచ్చే రోగుల సంఖ్య పెరగడం, ఏళ్లు గడుస్తున్నా కొద్దీ భవనం శిథిలావస్థకు చేరడంతో నూతన బిల్డింగ్‌కు నిధులు మంజూరయ్యాయి. గత టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.1.5 కోట్లు రాగా.. ఫిబ్రవరి 17, 2023న నాటి ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు భూమిపూజ చేశారు. కాగా ఇటీవలే పనులన్నీ పూర్తికాగా, సర్వహంగులతో నూతన భవనం పూర్తయింది. అధికారికంగా ప్రారంభించి, అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

మల్లెలమడుగులో కోతుల బెడద

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో కోతుల బెడదతో తీవ్ర స్థాయిలో ఉంది. కోతులు ఇళ్ల మీద బీభత్సం సృష్టిస్తున్నాయి. ఉదయం లేచి మహిళలు పనులు చేసుకోవాలన్నా, పిల్లలు, వృద్ధులు బయటకు కాలు మోపాలన్నా భయాందోళనకు గురవుతున్నారు. కోతుల సమస్య పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం ఇచ్చామని, సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలూ తీసుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తక్షణమే కోతుల బెడద సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని కూనవరం రోడ్డులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను టౌన్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా రెండు ట్రాక్టర్లలో ఇసుకను పట్టణంలోని తరలిస్తుండగా టౌన్ ఎస్సై విజయలక్ష్మి కూనవరం చెక్ పోస్టు వద్ద పట్టుకుని స్థానిక టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి, ట్రాక్టర్ డ్రైవర్ల పై కేసు నమోదు చేసినట్లుగా పోలీసులు తెలిపారు.

యువత క్రీడాస్ఫూర్తిని మరవొద్దు

కరకగూడెం: యువత ఎప్పుడూ క్రీడాస్ఫూర్తిని మరవద్దని కరకగూడెం, తాడ్వాయి మండలాల ఎస్సైలు రాజేందర్, శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆదివారం రంగాపురం గ్రామంలో గత వారం రోజులుగా జరుగుతున్న వీపీఎల్ సీజన్3 సూపర్ సిక్స్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు మ్యాచులకు వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ అన్ని రంగాల్లో రాణించి, తల్లిదండ్రులకు, సమాజానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. యువత ఉన్నత చదువులు చదువుకోవాలని, అలాంటి వారికి ఎలాంటి ప్రోత్సాహం అయిన అందిస్తామని అన్నారు. టోర్నిని ఆహ్లాదకరమైన వాతావరణంలో ఎలాంటి ఘర్షనలకు తావులేకుండా నిర్వహించిన నిర్వాహకులు గుండ్ల రంజిత్ కుమార్, గోపిలను అభినందించారు. మ్యాచ్‌లో మొదటి బహుమతి సివిల్ (మణుగూరు) జట్టు, రెండో బహుమతి రంగాపురం జట్టు, ఆ తర్వాత స్థానాల్లో నిలిచిన చొప్పాల, కొత్తగూడెం జట్లకు బహుమతులతో పాటు ప్రైజ్ మనీ అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, క్రీడాకారులు, కల్తీ నరేష్, బోడ ముత్తయ్య, కొమరం సతీష్, ఇర్ప సునీల్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ఎస్సైలు

జోరుగా ఉపాధి హామీ పనులు



సంద్రలబోడులో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

అశ్వాపురం: మండలంలో మహాత్మా గాంధి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు జోరుగా సాగుతున్నాయి. వ్యవసాయ పనులు లేకపోవడంతో, గిరిజన గ్రామాలు అధికంగా ఉండటంతో మండలంలో 24 గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ పనులకు రోజురోజుకు ఉపాధి హామీ కూలీలు పెరుగుతున్నారు. మండలంలో 24 గ్రామ పంచాయతీలలో ప్రతి రోజు 3 వేల నుంచి 3 వేల 5 వందల మంది కూలీలు ఉపాధి హామీ పనులు చేస్తున్నారు. గత నెలలో రోజుకు మూడువేల లోపు ఉండగా ఈ నెలలో ఐదు వందల నుండి వెయ్యి మంది కూలీలు పెరిగారు. ఉదయం 5.30 గంటలకు పనులకు వచ్చి ఎండ రాకముందే ఇండ్లకు చేరుకుంటున్నారు. కందకాలు తవ్వడం, చెరువులు, కుంటలు, కాలువలు పూడికతీత పనులు చేపడుతున్నారు. ఎంపీడీఓ వరప్రసాద్ పర్యవేక్షణలో ఏపీఓ సీతారామయ్య, ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్లు 24 గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ పనులను సందర్శిస్తూ ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, పంచాయతీ కార్యదర్శుల సహకారంతో కూలీల సంఖ్య పెరిగేలా, రోజు వేతనం రూ.300 చేరుకునేలా కూలీలకు తోడ్పాటు అందిస్తున్నారు. ఏపీఓ సీతారామయ్య వంద రోజులు రూ.30 వేలు అన్న పేరుతో ఉపాధి కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లతో ప్రత్యేకంగా వినూత్నమైన రీతిలో ఓ వాట్సప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసి ఉపాధి హామీ కూలీలకు ఎప్పటికప్పుడు సమాచారం చేరవేస్తూ కూలీలకు అన్ని విధాలుగా సహకారం అందిస్తున్నారు. ఉపాధి హామీ సగటు వేతనం లక్ష్య సాధనలో అశ్వాపురం మండలం జిల్లాలో రెండో స్థానంలో ఉంది. రోజు సగటు వేతనం రూ.263.76 తో 87.95 శాతం సాధిస్తుండటంతో మండలం రెండో స్థానంలో నిలిచింది. రూ.300 సగటు వేతనం వచ్చేలా కూలీలను పనులు చేయిస్తున్నారు.

విత్తనాల కొనుగోళ్లలో జాగ్రత్త



రైతు అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ అధికారులు

బూర్గంపాడు: విత్తనాల కొనుగోళ్లలో రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని ఏడీఏ తాతారావు, ఏఓ శంకర్ సూచించారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఆదివారం సోంపల్లి గ్రామంలో విత్తనాల కొనుగోళ్లపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు లైసెన్స్‌లు కలిగిన డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి బిల్లులు తీసుకోవాలన్నారు. పంటకాలం పూర్తయ్యే వరకు బిల్లులు, ఖాళీ విత్తనాల ప్యాకెట్లు జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. గ్రామాలలో తక్కువ ధరలకు నకిలీ విత్తనాలు అమ్మేవారి వద్ద విత్తనాలు కొనవద్దని సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారి సమాచారం వ్యవసాయ శాఖ అధికారులకు అందించాలని అన్నారు. భూమి పూర్తిగా పదునైన తరువాతనే విత్తనాలను వేసుకోవాలని, పచ్చిరొట్ట విత్తనాలను చల్లుకుని భూమిని సారవంతం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రసాద్, రైతు ప్రతినిధి గాదె నర్సిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

బదిలీలతో కార్మికులకు ఇబ్బందులు

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని యాజమాన్యం కార్మికులను ఇష్టానురీతిగా బదిలీలు చేస్తూ ఇబ్బందులకు గురి చేయడం సరికాదని ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ రామనర్సయ్య అన్నారు. ఆదివారం సాయంత్రం పీవీకాలనీలోని కేఎల్ మహేంద్ర భవన్‌లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బదిలీల్లో పారదర్శకత పాటించకుండా కేవలం కొందరికి ప్రయోజనం కల్పించడం కోసమే బదిలీలు చేస్తున్నారని ఆరోపించారు. పని ప్రదేశాన్ని అర్ధాంతరంగా మారుస్తూ యాజమాన్యం ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి అడ్డుగా ఉన్న ఎలక్షన్ కోడ్ బదిలీలకు అడ్డుగా లేకపోవడం కార్మిక క్షేత్రంలో అశాంతిని నెలకొల్పుతుందని యాజమాన్యం గుర్తించాలరిచ నిబంధనలు పక్కనపెట్టి చేసే బదిలీలతో ఉత్పత్తిలో ముందంజలో ఉన్న మణుగూరు ఇలాంటి చర్యల వల్ల వెనకబడే ప్రమాదం ఉందని అన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు మేకల ఈశ్వర్‌రావు, పుల్లారావు, నంబూరు శ్రీనివాసరావు, గోలి గంగాధర్ రావు, అబ్దుల్ సుభానీ, ఆవుల నాగరాజు, ఆదర్ల సురేందర్, గుండ్లపల్లి శరత్, దండు వీరవిజయ్‌కుమార్, గడ్డం సంతోష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జారే పర్యటన



ములకలపల్లి: రాంబాబును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

ములకలపల్లి: మండలపరిధిలోని పలుగ్రామాల్లో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదివారం విస్తృతంగా పర్యటించారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ, వైద్య చికిత్సలు పొందుతున్న ములకలపల్లి సుందర్యనగర్‌కు చెందిన కోరం రాంబాబును పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. అనాగ్యోంతో బాధపడుతున్న భగత్‌సింగ్ నగర్‌కు చెందిన తిరుపతమ్మను పరామర్శించారు. ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, మాజీ సర్పంచ్ కారం సుధీర్, శనగపాటి అంజి. గాడి తిరుపతిరెడ్డి, మేకల రాజేశ్, జహీర్, మిరియాల అవినాశ్, వంజరపు ఉమేశ్ తదితరులు ఉన్నారు.

ప్రత్యేక పూజలు..

దమ్మపేట: మండల పరిధిలోని అంకంపాలెం గ్రామంలో ఉన్న ముత్యాలమ్మ తల్లి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొన్నారు. ఆదివారం అంకంపాలెం గ్రామంలోని ముత్యాలమ్మ తల్లి ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు ఆలయ మొదటి వార్షికోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. అమ్మవారికి నిర్వహించిన కలశ పూజ, కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాల్లో పాల్గొని, తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం పట్వారిగూడెం గ్రామంలో పలు శుభ కార్యక్రమాలకు హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎందే త్యాగాల చరిత్ర..



సీపీఎం శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న మచ్చ వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: భారతదేశంలో సీపీఎందే త్యాగాల చరిత్ర అని, కష్టాలను ఎదుర్కొన్న వాడే నిజమైన కమ్యూనిస్టు అని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండలంలోని పగిడేరు పంచాయతీలో కుంజా కృష్ణకుమారి ప్రాంగణంలో సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. మండల కార్యదర్శి కొడిశాల రాములు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ఉపాధ్యాయులుగా మచ్చ వెంకటేశ్వర్లు సీపీఎం కార్యక్రమం విశిష్టత బోధించారు. దేశంలోని మూడు రాష్ట్రాల్లో 9 మంది ముఖ్యమంత్రులు పనిచేశారని పేదల సంక్షేమం కోసం సంక్షేమం కోసం తప్ప ఎవరి మీద ఎలాంటి మచ్చ లేదన్నారు. మధ్యాహ్నం క్లాసును సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రేపాకుల శ్రీనివాస్ బోధించి పార్టీ నిర్మాణం పని పద్ధతిని వివరించారు. మార్క్సిజం అధ్యయనం ఆవశ్యకత వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దామల్ల లెనిన్ బాబు, సత్రపల్లి సాంబశివరావు, ఉప్పతల నర్సింహారావు, బొల్లం రాజునందం, ఈశ్వర్‌రావు, పిట్టల నాగమణి, పల్లపు నాగేశ్వరరావు, పర్శిక పాపారావు, కుంజా రాజు, యుగంధర్, పద్మ గౌరీ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం



అన్నపురెడ్డిపల్లి: ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ జగదీశ్వర్‌ప్రసాద్



భద్రాచలంఅర్బన్: పట్టణంలోని పోలింగ్ కేంద్రంలో ఓటర్ల కోసం వేసిన టెంట్



కరకగూడెంలో జెడ్పీ పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద అధికారులు

అన్నపురెడ్డిపల్లి: మండలంలో ఎమ్మెల్సీ ఎన్నిక కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తహసీల్దార్ జగదీశ్వర్‌ప్రసాద్ ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో మొత్తం పట్టభద్రులు 639 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. పట్టభద్రులు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మధు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ సంధ్యారాణి ఆదివారం పరిశీలించారు. కేంద్రంలో సదుపాయాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విలేకరులతో మాట్లాడుతూ ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు.

కరకగూడెం: ఉమ్మడి వరంగల్లునల్గొండఖమ్మం గ్రాడ్యుయేట్స్ ఉప ఎన్నికకు సంబంధించి ఏర్పాట్లును అధికారులు పూర్తి చేశారు. మండలంలో ఓటు హక్కు వినియోగించుకోనున్న 598 మంది పట్టభద్రులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని కరకగూడెం తహసీల్దార్ నాగప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం కరకగూడెం జెడ్పీ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి ఎన్నికల అధికారులతో కలిసి ఏర్పాట్లు పూర్తి చేశారు. అంతేకాకుండా నేడు జరిగే పోలింగ్కు సంబంధించిన సామగ్రిని అధికారులు సిద్ధం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. మండలంలో ఉన్న పట్టభద్రులందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు.

నియోజకవర్గంలో 4,141 మంది పట్టభద్రులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం నియోజకవర్గం పరిధిలోని భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండలాల పరిధిలో 4141 మంది పట్టభద్రులు ఉన్నారు. కాగా నేడు జరుగనున్న ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల భద్రాచలం నియోజకవర్గంలో జరుగనున్న పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. నేడు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎమ్మెల్సీ పట్టభద్రుల ఉప ఎన్నికల పోలింగ్ జరగనుంది. అయితే పోలింగ్ ఏజెంట్లను నియమించుకుని అధికారులు నేడు ఉదయం 6 గంటలకు మాక్ పోలింగ్ నిర్వహించనున్నట్లు సమాచారం. భద్రాచలం నియోజకవర్గ పరిధిలో గల భద్రాచలం మండలంలో 5 పోలింగ్ కేంద్రాలలో 2006 మంది, చర్లలో ఒక పోలింగ్ కేంద్రంలో 1122 మంది, అదే విధంగా దుమ్ముగూడెంలో ఒక పోలింగ్ కేంద్రంలో 1013 ఇలా మొత్తం 4141 మంది పట్టభద్రులు నేడు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో తమ ఓటు హక్కును వినియోగం చేసుకున్నారు.